సాక్షి
గుంటూరు
బుధవారం । 25 । సెప్టెంబర్ । 2024



హనుమాన్ చాలీసా పారాయణం

నరసరావుపేటరూరల్: ఇస్సప్పాలెంలోని ఆర్య వైశ్య అన్నదాన సత్రంలో చాతుర్మాస దీక్ష ధ్యాన తరగతులు సందర్భంగా హనుమాన్ చాలీసా పారాయణం మంగళవారం నిర్వహించారు.



దిగువకు 36,950 క్యూసెక్కులు

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి మంగళవారం ఎగువ నుంచి 33,490 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా.. దిగువకు 36,950 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 6,636 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 1,760 క్యూసెక్కులు వది

ఇసుక.. కంకర.. కలిపి కూటమి దెబ్బ

- జిల్లాలో ఒకే స్టాక్ పాయింట్‌లో లభిస్తున్న ఇసుక
- వర్షాలకు ముందు బుక్ చేసుకున్న వారికే అవకాశం
- పలుచోట్ల తెలుగుదేశం నాయకుల అక్రమాలు
- ఇదే అదనుగా సామాన్యుల వద్ద అడ్డగోలు దోపిడీ
- సర్కారు తీరుతో కంకర క్వారీ యజమానుల సమ్మె

ఉమ్మడి గుంటూరు జిల్లాను ఇసుక కొరత వేధిస్తోంది. మరోవైపు కంకర క్వారీల యజమానులు సమ్మెకు దిగారు. ఈ కారణంగా భవన నిర్మాణంలో ఉపయోగించే కంకర(చిప్స్) కూడా దొరకడం లేదు. మైనింగ్ సెస్, రాయల్టీపై యజమానులు గత 20 రోజులుగా సమ్మెలో ఉన్నారు. దీంతో కంకర సరఫరా కూడా నిలిచిపోయింది. ఒకవైపు ఇసుక, మరోవైపు కంకర లభించక భవన నిర్మాణ రంగం కుదేలైంది. కార్మికులకు పనులు లేక పస్తులు ఉండాల్సి వస్తోంది.

నిలిచిన రవాణాతో ఎక్కడికక్కడ ఆగిన నిర్మాణాలు


సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో కేవలం ఒక్క స్టాక్ పాయింట్‌లోనే ఇసుక అందుబాటులో ఉంది. మిగిలిన చోట మొత్తం ఖాళీ అయ్యింది. బాపట్ల జిల్లా పరిధిలోని వారు కూడా గుంటూరు జిల్లాలోని స్టాక్ పాయింట్‌ను ఆశ్రయించాల్సి వస్తోంది. పల్నాడులో కూడా ఇదే పరిస్థితి. వారు నెల్లూరు జిల్లా నుంచి తెచ్చుకోవాలని సిబ్బంది సలహా ఇస్తున్నారు. తుళ్లూరు మండలంలో తాళ్లాయపాలెంలో స్టాక్ పాయింట్ మాత్రమే ఇప్పుడు ఇసుక ఉంది. అక్కడ కూడా తాజాగా టోకెన్లు ఇవ్వడం ఆపేశారు. కొత్త ఇసుక విధానం వచ్చినా ఈ పాయింట్ ఆన్‌లైన్‌లో చూపించకపోవడంతో కొత్తగా బుక్ చేసుకోలేని పరిస్థితి నెలకొంది. ఈ నెల 27వ తేదీ నుంచి అందుబాటులోకి వస్తుందని అధికారులు చెబుతున్నారు.

పెద్ద ఎత్తున అక్రమాలు

తాళ్లాయపాలెంలో వర్షాలకు ముందు బుక్ చేసిన బిల్లులకు లోడింగ్ పేరుతో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గతంలో ఇచ్చిన గడువు 23వ తేదీ ముగిసినా.. యథేచ్ఛగా లోడింగ్ కొనసాగుతూనే ఉంది. 24వ తేదీ కూడా భారీగా లారీలకు లోడింగ్ జరగడంలో ఆంతర్యం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

పల్నాడు జిల్లాలో ఎక్కడా ఇసుక లేదని, నెల్లూరులో ఉన్నందున బుక్ చేయమంటారా అంటూ సచివాలయం సిబ్బంది అడుగుతున్నారు. అక్కడి నుంచి లారీ ఇసుక తెప్పించాలంటే కిరాయి ఎక్కువ కావడంతో వినియోగదారులు వెనుకడుగు వేస్తున్నారు. బాపట్ల జిల్లాలో పెసర్లంక - పెదలంక అరవింద వారధి, గాజుల్లంక, జువ్వలపాలెం ప్రాంతాలలో కృష్ణానది నుంచి వందల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుక అక్రమంగా తరలుతోంది. ఈ ఇసుకను భట్టిప్రోలు, చెరుకుపల్లి, రేపల్లె, వేమూరు, చుండూరు, అమృతలూరు, తెనాలి ప్రాంతాలకు తరలిస్తున్నారు. ట్రాక్టర్ ఇసుకను దూరాన్ని బట్టి రూ. 5 వేల నుంచి రూ. 7 వేల వరకు విక్రయించి అక్రమార్కులు అందికాడికి సొమ్ము చేసుకుంటున్నారు.

వందల ట్రాక్టర్లతో తరలింపు



టీడీపీ నేతల చీకటి దందా

బోరుపాలెం ఇసుక రీచ్ వద్ద రాత్రి సమయంలో పోలీసుల సహకారంతో టీడీపీ నాయకులు యథేచ్ఛగా ఇసుక కొల్లగొడుతున్నారు. రాత్రి సమయంలో ట్రాక్టరుకు రూ.3,500 చెల్లిస్తే ఇసుక సరఫరా చేసుకునేలా పోలీసులతో ఒప్పందం కుదుర్చుకున్న తెలుగుదేశం నాయకులు తెల్లవార్లు తరలిస్తున్నారు. ఈ తంతు గురించి మండలం అంతా తెలియడంతో తుళ్లూరుకు చెందిన నాయకులు తమ ట్రాక్టర్లకు కూడా అనుమతి ఇవ్వాలంటూ రీచ్‌కు వచ్చారు. దీంతో పెద్ద పంచాయతీయే జరిగింది. తమ గ్రామ ట్రాక్టర్లకు తప్ప పక్క ఊరి వాటిని అనుమతించబోమని స్థానిక నాయకులు అనడంతో వివాదం పెద్దగా మారింది.

లింగాయపాలెంలోనూ తమ్ముళ్లకే అవకాశం

లింగాయపాలెం ఇసుక స్టాక్ పాయింట్‌లో రాత్రి సమయంలో గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడి సహకారంతో లోడింగ్ జరుగుతోంది. స్టాక్ పాయింట్‌లో ఇసుక ఉన్నప్పటికీ సామాన్యులకు రవాణాకు అనుమతులు ఇవ్వకుండా అడ్డగోలుగా తరలిస్తుండటంపై ప్రజలు మండిపడుతున్నారు. కృష్ణమ్మ చెంతనే ఉన్నా ఇసుక ఇబ్బందులు తప్పడం లేదని జిల్లా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో డబ్బులు చెల్లించి బుక్ చేసుకుందామన్నా అవకాశం లేకుండా పోయింది.

విఫలమైన ప్రభుత్వం

ప్రజల అవసరాలకు తగినంతగా ఇసుక అందించడంలో ప్రభుత్వం విఫలమైంది. వంద రోజుల్లో కూడా ఇసుక విధానంపై సరైన నిర్ణయం తీసుకోకపోవడం వల్ల నిర్మాణ రంగంలో ఉన్న కార్మికులకు పనిలేక ఖాళీగా ఉంటున్నారు. లారీ ఇసుక కొనుగోలు చేయాలంటే రూ.25 వేలు- రూ.30 వేల వరకు బ్లాక్ మార్కెట్ నడుస్తోంది. ఇంత పెట్టాలంటే ప్రజల కష్టాలు చెప్పనవసరం లేదు. ఇసుక సక్రమంగా సరఫరా అయితేనే అన్ని రంగాలకు ఉపయోగం. ప్రభుత్వం ఇకనైనా ప్రజలకు ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలి.

– చింతల భాస్కరరావు, సీపీఎం మండల కార్యదర్శి





అర్ధరాత్రి సమయంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలు (ఫైల్)

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

- ఓ యువకుడు మృతి
- 15 గంటలు కాలువలో గాలించగా మృతదేహం లభ్యం
- మరో యువకుడు మృత్యుంజయుడు
- విలపిస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు
- వడ్డవల్లిలో అలుముకున్న విషాదం

సత్తెనపల్లి: వినాయకుడి నిమజ్జనంలో అపశృతి చోటుచేసుకుంది. ఇరువురు యువకులు గల్లంతయ్యారు. వీరిలో ఒకరు మృతి చెందిన సంఘటన సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడు సమీపంలోని బ్రిడ్జి వద్ద గల గుంటూరు బ్రాంచ్ కెనాల్ కాలువలో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని హిందూ, ముస్లిం అనే భేదం లేకుండా మత సామరస్యాన్ని చాటి చెప్పేలా సత్తెనపల్లి మండలం వడ్డవల్లిలోని ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో వినాయక విగ్రహాన్ని ఈనెల 7న ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా హైదరాబాద్ నుంచి వినాయక విగ్రహాన్ని కొనుగోలు చేసి తీసుకువచ్చి మండపంలో ఏర్పాటు చేశారు. 17 రోజులపాటు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నసంతర్పణ చేపట్టారు. 17వ రోజైన సోమవారం రాత్రి వైభవోపేతంగా వినాయక నిమజ్జన ఊరేగింపు నిర్వహించారు. రాత్రంతా వినాయక ఊరేగింపు కొనసాగింది. తెల్లవారుజామున 4.30 గంటల సమయానికి గుంటూరు బ్రాంచ్ కెనాల్ కాలువలో వినాయక నిమజ్జనం చేశారు. ఆ సమయంలో 10 మంది వరకు కాలువలోకి దిగగా షేక్ మహమ్మద్ రఫీ (18), గండేపల్లి తిరుపతిరావులు గల్లంతయ్యారు. ఇరువురు యువకులు గల్లంతయ్యారన్న సంగతి తెలుసుకున్న వినాయక నిమజ్జన కమిటీతోపాటు మరికొందరు చీకటిలోనే గాలింపు చర్యలు ముమ్మరంగా చేపట్టారు. గల్లంతైన వారిలో గండేపల్లి తిరుపతిరావును కాపాడగలిగారు. మృత్యుంజయుడుగా తిరుపతిరావు బయటపడటంతో వెంటనే చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మరో యువకుడు షేక్ మహమ్మద్ రఫీ కోసం ఎంత గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. పోలీసులకు, వడవల్లి పెద్దలకు సమాచారం అందించడంతో పెద్దఎత్తున కాలువ వద్దకు చేరుకున్నారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు ప్రత్యేకంగా 10 మంది గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసి గల్లంతైన షేక్ మహమ్మద్ రఫీ కోసం వెతుకులాడారు. మంగళవారం సాయంత్రం 6:30 గంటల సమయంలో రఫీ మృతదేహం కాలువలో లభ్యమైంది. 15 గంటలపాటు శ్రమించి షేక్ మహమ్మద్ రఫీ మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు, వడ్డవల్లి వాసులు, వినాయక మండప కమిటీ సభ్యులు వచ్చి ఆవేదన వ్యక్తం చేయడంతో రోదనలు మిన్నంటాయి.



వినాయక ఊరేగింపులో రఫీ



రఫీ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

చేతికొచ్చిన కుమారుడిని కోల్పోయి..

పట్టణంలోని వడ్డవల్లికి చెందిన షేక్ పీరుబుడే, షేక్ జాకీరా దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. పీరుబుడే తాపీ పనులకు వెళ్లి జీవనం వెళ్లదీస్తున్నారు. 10వ తరగతి వరకు చదువుకున్న కుమారుడు షేక్ మహమ్మద్ రఫీ రెండేళ్ల కిందట చదువు మానేశాడు. తండ్రితోపాటు తాపీ పనులకు వెళుతూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. చేతికొచ్చిన కుమారుడు మృతి చెందడంతో అతడి కన్నవారు, ఇతర కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. రఫీ మృతి చెందడంతో పట్టణంలోని వడ్డవల్లిలో విషాదం అలుముకుంది.

ఆధునిక కన్ను.. నిఘాకు దన్ను!

- నూతన సాంకేతికత వినియోగం కీలకం
- ఇళ్లు, దుకాణాలకు పెరగనున్న రక్షణ
- అందుబాటులో కొత్త సీసీ కెమెరాల సామగ్రి
- వినియోగించుకోవాలని పోలీసు అధికారుల సూచన
- నేరాల నియంత్రణకు అవసరమని వెల్లడి


రోజురోజుకీ నేరస్తులు తెలివి మీరుతున్నారు. నేర కార్యకలాపాలు కూడా ఎక్కువ అవుతున్నాయి. చోరీలు, చైన్‌స్నాచింగ్‌లు, హత్యలు, రోడ్డు ప్రమాదాలు.. వంటి వాటిలో నిందితులను కనుగొనేందుకు పోలీసు దర్యాప్తునకు సీసీ కెమెరాల ద్వారా నిక్షిప్తమైన డాటా ఉపయోగపడుతోంది. తద్వారా బాధితులకు కూడా సత్వర సాయం, న్యాయం అందుతోంది. ఇప్పుడు మార్కెట్‌లోకి మరింత అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే సీసీ కెమెరాలు, ఇతర సామగ్రి అందుబాటులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఇళ్లు, దుకాణాల వద్ద ఇలాంటి పరికరాలు అమర్చుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

లక్ష్మీపురం: జనాభా పెరుగుదలకు అనుగుణంగా నగరాలు, పట్టణాలు కూడా విస్తరిస్తున్నాయి. దీంతోపాటు నేర సంబంధ కార్యకలాపాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో భద్రతాపరంగా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. నేరాల నియంత్రణకు తమకు ప్రజలు సహకారం అందించాలని పోలీసు శాఖ కూడా సూచిస్తోంది. అందుకు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరుతోంది. అందులో భాగంగా అత్యాధునిక నిఘా నేత్రాలను ఇళ్లు, దుకాణాల వద్ద ఏర్పాటు చేసుకోవాలని సూచించింది. విజిబుల్ పోలీసింగ్‌తో చోరీలకు, నేరాలకు పాల్పడే వారిని త్వరతగతిన పట్టుకునేందుకు వీలుంటుందని భావిస్తోంది. దీనిపై ప్రజలకు వివరించే పనిలో పోలీసులు ఉన్నారు. గతంలో ఉపయోగించిన ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాలు నేరాల నియంత్రణలో సాయపడుతూ వచ్చాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న అధునాతన సీసీ కెమెరాలు మరింత సమర్థంగా పని చేస్తున్నాయని పోలీసులు తెలిపారు.

ఎక్కడ ఏవి వాడాలంటే..

ఇటీవల గుంటూరులోని నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధి ఏటీ అగ్రహారం, అరండల్‌పేట, బ్రాడిపేట.. పట్టాభిపురం స్టేషన్ పరిధిలో ఎస్‌వీఎన్ కాలనీ, చంద్రమౌళినగర్ తదితర ప్రాంతాలలో నేరాలు పెరిగాయి. ఇక్కడ చోరీలు, చైన్ స్నాచింగులు, జేబు దొంగతనాలు వంటివి ఎక్కువయ్యాయి. ఇతర ప్రాంతాల్లోనూ అప్పుడప్పుడు చోరీలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు కెమెరాలకు సంబంధించి పలు సూచనలు చేశారు. బయటి వైపు టేపో క్రిస్టల్ క్లియర్ 2కే క్యూహెచ్‌డీ పరిజ్ఞానం ఉన్న స్మార్ట్ హోం సెక్యూరిటీ కెమెరాలు అమర్చుకోవాలన్నారు. ఈ కెమెరాల్లో నైట్ విజన్, మోషన్ డిటెక్షన్, టూ వే ఆడియో, స్టోరేజ్ ఆప్షన్, ఎలక్ట్రానిక్ పాస్ సౌకర్యాలు ఉంటాయని చెప్పారు. లోపల వైపు కెమెరా ఏర్పాటుకు పాన్ సెక్యూరిటీ వైఫై స్మార్ట్ పరిజ్ఞానం గానీ, 4జీ సిమ్ ఆధారంగా వైఫైతో పని చేసే 3 ఎంపీ స్మార్ట్ కేమెట్ హైబ్రిడ్ పరిజ్ఞానం కలిగినదిగానీ ఎంచుకోవాలని సూచించారు. ఈ కెమెరాల్లో పాన్ ఫీచర్, హై రెజుల్యూషన్, వైఫై కనెక్టివిటీ, నైట్ విజన్, టూ వే ఆడియో కూడా ఉంటుంది. ఇవి దుకాణాలకు ఉపయోగపడుతాయని తెలిపారు. ఊరికి దూరంగా వైఫై లేని ఇళ్లకు సోలార్ 4జీ సిమ్, 4 ఎంపీ పాన్, టిల్ట్ జూమ్ సదుపాయం ఉన్న సీసీ కెమెరాలు వాడాలని పోలీసులు తెలిపారు. వీటికి వాటర్ ప్రూఫ్ సౌకర్యం ఉంటుంది. రికార్డింగ్ చేసినవి స్పష్టంగా కనిపిస్తాయి. జూమ్ సౌకర్యం కూడా లభిస్తుంది. ఈ పరిజ్ఞానం కలిగిన కెమెరాలను కార్లు, బైక్‌లలో వెళ్లేవారు కూడా వినియోగించుకోవచ్చు.





అత్యాధునిక 2కే ఫుల్ హెచ్‌డీ కెమెరాలు

సీసీ కెమెరాలతో పటిష్ట నిఘా...



గుంటూరు జిల్లా బాధ్యతలు స్వీకరించిన తరువాత కొన్ని ప్రాంతాలలో క్షుణ్ణంగా పరిశీలించా. అవసరమైనచోట సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించా. ప్రజల భద్రతలో ఇది ఒక భాగమే. దీనికి వారు కూడా సహకారం అందించాలి. కెమెరాల ఏర్పాటు కోసం కొంత ఖర్చు అయినా దాని ప్రయోజనం ఎంతో ఉంటుంది. ఇళ్ల యజమానులు, దుకాణాదారులు ఈ విషయం తెలుసుకోవాలి. వాహనాలకు కూడా ఏర్పాటు చేసుకుంటే చోరీ చేయడానికి ఎవరైనా ప్రయత్నించినప్పుడు సులభంగా పట్టుకోవచ్చు. కెమెరాల ఏర్పాటులో సందేహాలు ఉంటే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలి. పూర్తి వివరాలు చెబుతాం. ఈ కెమెరాలన్నీ మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. ప్రజలు ఇళ్లు వదిలి వెళ్లేటప్పుడు స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి. లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్)ను బిగిస్తాం. సాధ్యమైనంత వరకు చోరీలను అరికట్టవచ్చు. ఉచితంగా ఎల్‌హెచ్‌ఎంఎస్ మొబైల్ యాప్ సేవలు అందుబాటులో ఉన్నాయి. సద్వినియోగం చేసుకోవాలి.

– ఎస్.సతీష్‌కుమార్, ఎస్పీ, గుంటూరు జిల్లా

రఘురామ కృష్ణంరాజుపై కేసు నమోదు చేయాలి

రేపల్లె రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన ఉండి శాసన సభ్యుడు రఘురామ కృష్ణంరాజుపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ పలువురు న్యాయవాదులు, ప్రజాసంఘాల నాయకులు మంగళవారం బాపట్ల జిల్లా రేపల్లెలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేసి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జై భీమ్ యాక్సెస్ జస్టిస్ రాష్ట్ర కార్యదర్శి దోవా రమేష్ రాంజీ మాట్లాడుతూ ఆర్థిక, క్రిమినల్ నేర చరిత్ర కలిగిన పశ్చిమగోదావరి జిల్లా ఉండి శాసన సభ్యుడు రఘురామకృష్ణంరాజు ఈనెల 21న రహదారి పక్కన కట్టి ఉన్న రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ ఫ్లెక్సీను ఉద్దేశపూర్వకంగా చించి ఘోరంగా అవమానించారన్నారు. ఇటువంటి ఘాతుకానికి పాల్పడిన రఘురామ కృష్ణంరాజుపై దేశద్రోహం చట్టం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంపై స్పందించి రఘురామ కృష్ణంరాజుపై సుమోటోగా కేసు నమోదు చేయటంతో పాటు శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి ఘటనకు ఎవరూ పాల్పడకుండా కృష్ణంరాజుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు దారం సాంబశివరావు, కర్రా ప్రతాప్, గుమ్మడి కుమార్ బాబు, యడ్ల గోపిరాజు, దళిత ప్రజాసంఘాల నాయకులు చెరుకూరి లక్ష్మణరావు, వాగోలు రమేష్, మాల యువసేన కార్యదర్శి పెరికల రమణ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

జెడ్పీ సీఈవోగా జ్యోతిబసు బాధ్యతల స్వీకరణ



గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జెడ్పీ సీఈవోగా వి.జ్యోతిబసు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన జెడ్పీ అతిథి గృహంలో చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మిని మర్యాద పూర్వకంగా కలిశారు. సీఈవోగా బాధ్యతలు చేపట్టిన జ్యోతిబసును డిప్యూటీ సీఈవో మోహన్‌రావు, అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

యార్డుకు 48,267 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 48,267 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 46,245 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 16,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 18,600 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 9,000 నుంచి రూ. 16,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 9,000 నుంచి రూ. 18,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 24,264 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

చేనేత స్టాల్స్ సందర్శన



మంగళగిరి: మంగళగిరి ఆటోనగర్‌లో ఉన్న ఏపీఐఐసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల స్టాల్స్‌ను చేనేత జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె సునీత, కమిషనర్ రేఖారాణిలు మంగళవారం సందర్శించారు. కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను దుకాణదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ కె సునీత మాట్లాడుతూ చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచడం కోసం ఏపీఐఐసీలో స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీ వనజ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు గుండె వ్యాధులకు పరీక్షలు

మంగళగిరి: మంగళగిరిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ(ఎయిమ్స్) ఆధ్వర్యంలో బుధ, గురువారాలలో గుండె వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎయిమ్స్ ప్రతినిధి డాక్టర్ వంశీకృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 29వ తేదీన ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం గ్రామీణ ఆరోగ్య కేంద్రం నూతక్కిలో, గురువారం మంగళగిరి ప్రభుత్వాసుపత్రిలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

పొంగిన చంద్రవంక వాగు



మాచర్ల: మాచర్ల పట్టణం, రూరల్ ప్రాంతాలలో సోమవారం సాయంత్రం నుంచి కురిసిన భారీ వర్షాలకు చంద్రవంక పొంగి పొర్లింది. మాచర్ల నుంచి జమ్మలమడక, తుమృకోటకు వెళ్లే రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా గ్రామాలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, ఇన్‌చార్జి కమిషనర్ నాగేశ్వరరావు, డి నాగభూషణం, అర్బన్ సీఐ ప్రభాకరరావులు చంద్రవంక వాగును పరిశీలించారు. అనంతరం పురపాలక సంఘం వారు బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న వ్యర్థాలను జేసీబీ ద్వారా తొలగించారు. ప్రజలెవరూ వాగు వైపు వెళ్లకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పలు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం నిమ్మకాయలు క్వింటా ధర

కనిష్ఠం : రూ. **5,000** గరిష్ఠం : రూ. **7,500**

మోడల్ ధర రూ. **6,400**

క్లుప్తంగా

రామారావుకు ఉత్తమ ప్రిన్సిపల్ పురస్కారం



గుంటూరు రూరల్: చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు జాతీయ ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. ఫార్మసీ వృత్తిలో అత్యుత్తమ సేవలకుగాను అసోసియేషన్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టీచర్స్ ఆఫ్ ఇండియా (ఏపీటీఐ) ఈ మేరకు ప్రకటించింది. చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు ఈ విషయం తెలిపారు. మంగళవారం లాం లోని కళాశాలలో రామారావుకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 27, 28వ తేదీలలో భువనేశ్వర్‌లో జరిగే సదస్సులో రామారావు అవార్డు అందుకోనున్నట్లు వివరించారు. అధ్యాపక బృందం, కళాశాల సెక్రటరీ సుజిత్ కుమార్ తదితరులు అభినందనలు తెలిపారు.

శివాలయం అభివృద్ధికి చర్యలు



బాధ్యతలు స్వీకరిస్తున్న లీలాకుమార్

పెదకాకాని: భక్తులు, దాతల సహకారంతో శివాలయం అభివృద్ధికి కృషి చేస్తానని నూతన ఉప కమిషనర్ జీవీడీఎన్ లీలాకుమార్ అన్నారు. శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం నూతన ఉప కమిషనరుగా మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఉప కమిషనరు, ఉప కార్య నిర్వహణాధికారిగా లీలాకుమార్ వ్యవహరించారు. మంగళవారం ఆయనకు దేవస్థాన అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ప్రత్యేక అభిషేకం, కుంకుమ పూజలో ఆయన పాల్గొన్నారు. అర్చకులు ఆశీర్వచనం ఇచ్చి, స్వామి వారి శేషవస్త్రం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పికిల్ బాల్.. భలే హుషార్!

- సులభంగా ఆడేలా ఉండటంతో ఆసక్తి
- జిల్లాలో తొలిసారి రాష్ట్ర స్థాయి టోర్నీ



గుంటూరులో సాధన చేస్తున్న క్రీడాకారులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): రాష్ట్రంలో గత ఏడాది ప్రవేశించిన పికిల్ బాల్ ఆట అందర్నీ అలరిస్తోంది. గుంటూరులో ఈ ఏడాది మార్చిలో ఈ ఆట ప్రారంభించారు. రాష్ట్రంలోనే తొలిసారి ఇక్కడ రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ ఏర్పాటైంది. పలువురు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. టెన్నిస్, షటిల్, టీటీలకు అనుబంధంగా ఈ క్రీడ ఉంటుంది. టెన్నిస్ మైదానంలో మూడోవంతు కోర్టు ఉంటే చాలు. బాల్ ధర రూ.100 నుంచి రూ.150 మాత్రమే. బ్యాట్ రూ.2,500 నుంచి లభిస్తుంది. సుదీర్ఘకాలం సాధన చేసుకునే వెసులుబాటు ఉంటుంది. అంతర్జాతీయ స్థాయిలో ఈ క్రీడకు గుర్తింపు ఉన్నప్పటికీ మన దేశంలో ఇప్పుడిప్పుడే ఆదరణ పొందుతోంది. ఈ క్రమంలో పట్టణంలో కొందరు ఔత్సాహికులు ఈ క్రీడాభివృద్ధికి నడుం బిగించారు. దాదాపుగా టెన్నిస్‌లా ఈ ఆట ఉంటుంది. సింగిల్స్, డబుల్స్ ఉంటాయి. స్కోర్లు 11, 15, 21.. ఇలా సమయం బట్టి నిర్ణయించుకోవచ్చు. విన్నర్‌కి, రన్నర్‌కి 2 పాయింట్లు తేడా ఉంటుంది. 30 నిమిషాలలోపు గేమ్ పూర్తి చేయొచ్చు. దీంతో ఆసక్తి పెరుగుతోంది.

ఖర్చు తక్కువ కావడంతో ఆదరణ



టెన్నిస్ అంటే చాలా ఖరీదైన క్రీడ. పికిల్ బాల్ ఆటలో బంతి ఖరీదు రూ.100, బ్యాట్ రూ.2,500 నుంచి ప్రారంభం అవుతుంది. ఎవరైనా సాధన చేయొచ్చు. ముఖ్యంగా గ్రామీణ యువతకు బాగా నచ్చుతుంది. అపార్ట్‌మెంట్స్‌లో మహిళలు ఆడుకోవచ్చు. రాష్ట్ర పోటీల్లో రన్నర్‌గా నిలిచా. మరింత సాధన చేస్తాను.

– కె.చరణ్, గుంటూరు

ప్రతి జిల్లాకూ విస్తరిస్తాం



గతేడాది విశాఖలో ఈ క్రీడ ప్రారంభమైంది. ప్రస్తుతం గుంటూరుతోపాటు మరి కొన్ని ప్రాంతాల్లో ఆదరణ ఉంది. దీనిని రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తాం. ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేసేలా సులభంగా ఆడే ఈ గేమ్‌ను ప్రమోట్ చేస్తున్నాం. ప్రతి జిల్లాలో పోటీలు నిర్వహిస్తాం. విదేశాల్లో ఈ ఆటకు క్రేజ్ ఉంది. ఇప్పుడిప్పుడే మన దేశంలో ప్రాచుర్యం పొందుతోంది.

– ఎన్.శ్రీధర్, పికిల్ బాల్ రాష్ట్ర సంఘం కార్యదర్శి

సామాన్యులకు సైతం అందుబాటులో..



బిజీ జీవన విధానంలో చాలా మంది వ్యాయామం, క్రీడా సాధన వంటివి చేయడం లేదు. పికిల్ బాల్ కోర్టు అపార్ట్‌మెంట్, కార్యాలయాల ఆవరణలో కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. మైదానాలు, క్లబ్స్, జిమ్స్.. ఇలా ఎక్కడైనా తయారు చేసుకోవచ్చు. వయోబేధం లేకుండా ఆడే ఈ ఆట త్వరలోనే భారత్‌లో మంచి క్రేజ్ సంపాదించుకుంటుంది. క్లబ్ ఆవరణలో ఉచితంగా కోర్టు వినియోగించుకునే అవకాశం కల్పించాం.

– టి.అరుణ్ కుమార్, వీవీ హెల్త్, హార్ట్ క్లబ్ డైరెక్టర్

రాష్ట్ర స్థాయి టోర్నీలో గెలిచా



పికిల్ బాల్ రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌ను గుంటూరులో నిర్వహించడం సంతోషంగా ఉంది. సింగిల్స్ విజేతగా నిలిచా. నేను టెన్నిస్ ఆడేవాడ్ని. దీనికి కూడా ఆ ఆటతో సంబంధం ఉంది. ఆడేటప్పుడు పెద్ద ఇబ్బంది రాలేదు. ఎవరైనా ఆడుకోవచ్చు. భవిష్యత్తులో మరింత సాధన చేసి జాతీయ స్థాయిలో పోటీ పడతా.

– పి.ఆనంద్ కుమార్, విజయవాడ

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి

నగరంపాలెం: బాలల హక్కులను కాపాడే బాధ్యత అందరిపై ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి అన్నారు. సామాజిక కార్యకర్తలు, పారా లీగల్ వలంటీర్స్‌కు పోక్సో చట్టంపై మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్థసారథి మాట్లాడుతూ.. లైంగిక వేధింపులకు గురవుతున్న బాలలకు న్యాయసహాయం అందించాలని చెప్పారు. వారి తక్షణ అవసరాలు తీర్చడమే పోక్సో సహాయక వ్యక్తుల ప్రధాన బాధ్యత అన్నారు. పలు అంశాలపై జిల్లా బాలల రక్షణాధికారి సీహెచ్ విజయకుమార్ అవగాహన కల్పించారు. బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ ప్రమీల, ప్యానెల్ అడ్వకేట్ కట్ట కాళిదాసు, బచ్‌పన్ బచావో ఆందోళన్ రాష్ట్ర సమన్వయకర్త తిరుపతిరావు, క్రాఫ్ స్టేట్ ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ ఫ్రాన్సిస్ తంబి, సంస్థ జిల్లా కార్యదర్శి టి.లీలావతి కూడా ప్రసంగించారు. సామాజిక కార్యకర్తలు, పారా లీగల్ వలంటీర్స్ పాల్గొన్నారు.

20వ రోజుకు కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సుల నిరసన



నినాదాలు చేస్తున్న స్టాఫ్‌నర్సులు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు మంగళవారం విధులు బహిష్కరించి సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట తమ నిరసన తెలిపారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తమ ఉద్యోగాలను ఏఎన్‌ఎంలకు ఇచ్చేలా ప్రభుత్వం ఈ నెల 4న విడుదల చేసిన జీవో నెంబరు 115ను రద్దు చేయాలంటూ డిమాండ్ చేశారు. రెగ్యులర్ స్టాఫ్‌నర్సుల ఉద్యోగాల నోటిఫికేషన్ 15 ఏళ్లుగా ప్రభుత్వం ఇవ్వకపోవడం వల్ల తాము తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. ప్రభుత్వం స్పందించకుంటే నిరసన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మంగళవారం 20వ రోజు కార్యక్రమంలో కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సుల యూనియన్ రాష్ట్ర నాయకురాలు పి.మనీష, జిల్లా అధ్యక్షురాలు రేణుక, సెక్రటరీ శివమ్మ, కోశాధికారి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు కోటేశ్వరి, సౌజన్య, కరుణ, జాయింట్ సెక్రటరీలు హైమావతి, సంధ్య, మేరీ, రమాదేవి, సభ్యులు కుసుమ కుమారి, సుధారాణి, బాలసుందరి, అంజమ్మ, సురేష్, సర్దార్, సుభాని తదితరులు పాల్గొన్నారు.

పోస్టులు భర్తీ చేసి పనిభారం తగ్గించాలి



మాట్లాడుతున్న రాంబాబు

కొరిటెపాడు (గుంటూరు): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ)లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి ఉద్యోగులపై పనిభారం తగ్గించాలని అఖిల భారత యూబీఐ అధికారుల ఫెడరేషన్ ప్రాంతీయ కార్యదర్శి మాదాల రాంబాబు డిమాండ్ చేశారు. యూబీఐ ఉద్యోగులు, సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఫెడరేషన్‌తోపాటు అఖిల భారత యూనియన్ బ్యాంక్ ఉద్యోగుల అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జీటీ రోడ్‌లోని యూబీఐ ప్రాంతీయ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. బ్యాంక్ ఉద్యోగులపై పనిభారం తగ్గించాలన్నారు. విష సంస్కృతిని మేనేజ్‌మెంట్ విడనాడాలని కోరారు. ఇన్సూరెన్స్, ఇతర పథకాలపై దృష్టి తగ్గించి బ్యాంకింగ్ వ్యాపారంపై దృష్టి సారించాలన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలు, సదుపాయాలు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. నూతనంగా జారీ చేసిన అప్రెంటీస్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తాత్కాలిక ఉద్యోగులకు కనీస వేతనం చెల్లించాలన్నారు. అసోసియేషన్ నాయకులు కళ్యాణ్, బాషా, క్రాంతి, వేణు బాబు, యూబీఐ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజికాభివృద్ధికి విద్యార్థుల కృషి ముఖ్యం

జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్

చేబ్రోలు: సామాజిక, ఆర్థిక అభివృద్ధికి విద్యార్థులు కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ సూచించారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఎన్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపక దిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు సమాజానికి వీలైనంత సేవ చేయాలని కోరారు. పది మందికి ఉపయోగపడే పనులు చేయాలన్నారు. ఇటీవల విజయవాడలో వరద సహాయక చర్యల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. చేబ్రోలు మండలంలోని ఐదు గ్రామాలను దత్తత తీసుకుని ఏడాది కాలంలో 107 సామాజిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయం అన్నారు. చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ.. సమీప ప్రాంతాల్లోని ప్రజలకు విద్య, ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత, కాలుష్య నివారణ వంటి అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు నిర్వహించిన కార్యక్రమాలకు సంబంధించిన ప్రత్యేక పుస్తకాన్ని ఆవిష్కరించారు. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

హెవీ మోటార్ డ్రైవింగ్ శిక్షణకు ప్రవేశాలు ప్రారంభం

పట్నంబజారు: ఏపీఎస్‌ఆర్టీసీ గుంటూరు 2 డిపో నందు హెవీ మోటార్ డ్రైవింగ్ ట్రెనింగ్ స్కూల్‌లో 17వ బ్యాచ్‌కు ప్రవేశాలు ప్రారంభించినట్లు మేనేజర్ షేక్ అబ్దుల్ సలాం మంగళవారం తెలిపారు. 16 మందికి మాత్రమే అవకాశం ఉందన్నారు. లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ కలిగిన వారు అర్హులన్నారు. శిక్షణ పూర్తి చేసిన తరువాత సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. వివరాలకు 88973 71003, 73828 94585 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రాధాన్యత రంగాలకు వేగంగా రుణాలివ్వాలి



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

గుంటూరు వెస్ట్: వార్షిక రుణ ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ ప్రాధాన్యత రంగాలకు వేగంగా రుణాలివ్వాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ మినీ సమావేశ మందిరంలో నిర్వహించిన డీసీసీ, డీఎల్‌ఆర్‌సీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వార్షిక ప్రణాళికలో భాగంగా తొలి త్రైమాసికంలో ప్రాధాన్యత, ప్రాధాన్యేతర రంగాలకు కేటాయించిన రుణ లక్ష్యాలను బ్యాంకర్లు నిర్దిష్ట కాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, అకాల వరదల కారణంగా అన్ని రంగాలకు అపార నష్టం వాటిల్లిందన్నారు. ఆర్బీఐ మార్గదర్శకాల ప్రకారం రైతులకు, చిరు వ్యాపారులకు రుణాలు రీషెడ్యూల్ చేయాలని కోరారు. పరిహారం మంజూరు చేయడానికి సిద్ధం చేసిన ప్రభుత్వ జాబితాను బ్యాంకర్లు కూడా ప్రామాణికంగా తీసుకోవాలన్నారు. కౌలు రైతుల విషయంలో ఉదారంగా వ్యవహరించాలని కోరారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజనలో ఆమోదించిన దరఖాస్తులకు వెంటనే రుణాలు మంజూరు చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాలు, విద్యార్థులు, గృహ నిర్మాణదారులకు రుణాలకు త్వరగా మంజూరు చేయాలని సూచించారు. సమావేశంలో డీసీసీ కన్వీనర్ ఎస్.జవహర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రత్న మహిపాల్ రెడ్డి, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

రాజకీయాల్లో ఆణిముత్యం సీతారాం ఏచూరి



సీతారాం ఏచూరి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నేతలు

లక్ష్మీపురం: దేశ రాజకీయాల్లో ఎత్తిన ఎర్ర జెండాను దించకుండా ప్రజా సమస్యలపై పోరాడిన యోధుడు సీతారాం ఏచూరి అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. గుంటూరు జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం రాత్రి సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. సభకు నగర కార్యదర్శి కె.నళినీకాంత్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సంపాదన కోసమే రాజకీయాల్లోకి వస్తున్న నేతలు ఉన్న ఈ రోజుల్లో జీవితాంతం నిరాడంబరంగా ప్రజల కోసం పోరాడిన ఏచూరి లాంటి ఆణిముత్యాలు అత్యంత అరుదు అన్నారు. లౌకిక వాద శక్తులను కూడగట్టడంలో కీలక భూమిక పోషించారని కొనియాడారు. ప్రజాస్వామ్యం బలపడాలని కోరుకున్న మహానేత ఏచూరి అన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ప్రసంగిస్తూ.. భారత రాజకీయాలలో సీతారాం ఏచూరి కీలక పాత్ర పోషించారన్నారు. కామన్ మినిమం ప్రోగ్రాం రూపకల్పనలో ప్రధాన భూమిక పోషించారని పేర్కొన్నారు. ఉపాధి హామీ, అటవీ హక్కుల పరిరక్షణ, ఆర్‌టీఐ, ఆహార భద్రత, విద్యాహక్కు చట్టాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించారన్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలి, సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, జన చైతన్య వేదిక అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, వీసీకే రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్, విరసం అధ్యక్షుడు సీఎస్‌ఆర్ ప్రసాద్, ప్రజా గాయకుడు రమణ తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలులో 106.8 మి.మీ. వర్షపాతం

కొరిటెపాడు (గుంటూరు): గుంటూరు జిల్లాలో సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు అత్యధికంగా చేబ్రోలు మండలంలో 106.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా కాకుమాను మండలంలో మి.మీ. పడింది. సగటు 15.2 మి.మీ.గా నమోదైంది. వట్టిచెరుకూరు మండలంలో 53.6, తెనాలి 23, గుంటూరు పశ్చిమ 16.2, తాడికొండ 16.2, గుంటూరు తూర్పు 15.4, పెదకాకాని 12.4, పొన్నూరు 11.8, తుళ్ళూరు 9.8, ప్రత్తిపాడు 3.4, దుగ్గిరాల 2.8, పెదనందిపాడు మండలంలో 1.6 మి.మీ. చొప్పున పడింది. సెప్టెంబర్ 24వ తేదీ వరకు సాధారణ వర్షపాతం 116.2 మి.మీ.కాగా.. ఇప్పటి వరకు 258.1 మి.మీ. నమోదైంది.


పిడుగుపాటుకు దెబ్బతిన్న విద్యుత్ సామగ్రి

చేబ్రోలు: మండలంలో సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు భారీ వర్షంతోపాటు పిడుగులు పడటంతో పలు చోట్ల విద్యుత్ పరికరాలు దెబ్బతిన్నాయి. శలపాడు గ్రామంలో విద్యుత్తు తీగలు, ఇళ్లలోని ఫ్యాన్‌లు, టీవీలు దెబ్బతిన్నాయి. వేజండ్ల రైల్వే స్టేషన్ సమీపం, వడ్లమూడి విజ్ఞాన్ హాస్టల్ వద్ద, గ్రామంలో మరో చోట ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. రైల్వే వ్యవస్థకు అవసరమైన సిగ్నల్స్‌కు ఇబ్బందులు రాకుండా ఏఈ పి.సుధీర్ ఆధ్వర్యంలోని సిబ్బంది మరమ్మతులు చేశారు.

కృష్ణానదిలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

తాడేపల్లి రూరల్: దిగువ కృష్ణానదిలోని కనకదుర్గ వారధి సమీపంలో మృతదేహం ఉందని తాడేపల్లి పోలీసులకు సమాచారం అందింది. మంగళవారం ఎస్ఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి వెళ్లి నీటిలోని మృతదేహాన్ని బయటకు తీయించారు. ఆమె వివరాలు తెలుసుకునేందుకు ఎలాంటి ఆధారాలు కనిపించలేదు. వయస్సు 45-50 సంవత్సరాలు ఉండవచ్చని, ఆచూకీ తెలిసిన వారు 08645 272186కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు నైపుణ్యం పెంచుకోవాలి



మాట్లాడుతున్న వీసీ ఆచార్య కె.గంగాధర రావు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో వ్యవస్థాపక దిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త డాక్టర్ వి.దివ్య తేజోమూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఉపకులపతి ఆచార్య కె.గంగాధర రావు మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు నైపుణ్యం, జీవన విధానం మెరుగు పరుచుకోవాలన్నారు. ప్రత్యేక అతిథిగా వాసవ్య మహిళా మండలి ప్రెసిడెంట్ డాక్టర్ బి.కీర్తి మాట్లాడుతూ.. సమయపాలన, క్రమశిక్షణ, బాల్యవివాహాల నిర్మూలనకు కృషి, వితంతువులు సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తున్నామని చెప్పారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు కూడా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త వి. దివ్య తేజోమూర్తి మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతోపాటు సామాజిక బాధ్యతను కూడా పెంపొందించాల్సిన బాధ్యత ప్రోగ్రాం ఆఫీసర్లపై ఉందన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.రత్న షీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, ఓఎస్‌డీ ఆచార్య ఆర్‌వీఎస్‌ఎస్‌ఎన్ రవికుమార్, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె.వీరయ్య, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పి.సిద్ధయ్య, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ డి.శ్రీనివాసరావు, రవికుమార్, డాక్టర్ కె. సృజన, పి.యుగంధర్ రెడ్డి, సీహెచ్ ఉమాశంకర్, కె.వి.నిరుపమ, సి.హెచ్. పుణ్య శేఖర్, వివిధ కళాశాలలఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులకు నగదు పురస్కారాలు ప్రదానం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో క్రీడాకారులకు నగదు పురస్కారాలు ప్రదానం చేశారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో వీసీ ఆచార్య కె. గంగాధరరావు ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయంలో వసతులను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెక్టార్ ఆచార్య కె రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య పాల్ కుమార్, ప్రపంచ విశ్వవిద్యాలయాల క్రీడా పోటీల్లో కాంస్య పతకం సాధించడంతోపాటు ప్యారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న ఏఎన్‌యూ దూర విద్యా కేంద్రం విద్యార్థిని వై.జ్యోతికి రూ.లక్ష నగదు బహుమతి అందజేశారు. క్రీడా శాఖ ఆధ్వర్యంలోని వివిధ కళాశాలల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన క్రీడా అధ్యాపకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ విద్య విభాగానికి చెందిన ఆచార్య జాన్సన్ , డాక్టర్ డి. సూర్య నారాయణ, డాక్టర్ ఇన్నయ్య, డాక్టర్ రామ్మోహన రావు తదితరులు పాల్గొన్నారు. ఈ ఏడాది ఏఎన్‌యూలో అంతర్ విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించనున్నామని డైరెక్టర్ పాల్ కుమార్ తెలిపారు.